సంపుటి :03 | సంచిక :80 | పేజీలు :05 | www.aksharadarbar.com

అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

గురువారం 30, ఏప్రిల్ 2026




## 21 నుంచి సరస్వతి అంత్య పుష్కరాలు

- పోస్టర్, టీజర్ విడుదల చేసిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు
- పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశాలు

04

# ఖాకీలకు సీపీ
# షాక్ ట్రీట్‌మెంట్

### అవినీతి పోలీసులపై సన్ ప్రీత్ సింగ్ ఉక్కుపాదం

- వరంగల్ కమిషనరేట్ పరిధిలో వరుస సస్పెన్షన్లు
- తాజాగా ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఒక కానిస్టేబుల్ సస్పెన్షన్
- తప్పు చేస్తే ఇంటికే.. అక్రమార్కుల్లో వణుకు

04





విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన పోలీసులపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కొరడా ఝులిపిస్తున్నారు. ఫిర్యాదులు తన దృష్టికి రాగానే విచారణకు ఆదేశిస్తున్నారు. నివేదికలు అందగానే అవినీతిపరులు, అక్రమార్కులపై సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. ఇటీవలి కాలంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లను ఆయన సస్పెండ్ చేయడం పోలీసు శాఖలో కలకలం రేపుతుంది. ప్రధానంగా అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. తాజాగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లతో పాటు ఒక కానిస్టేబుల్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఒక కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, డబ్బు ఇవ్వని వారి ఇంటి పై దాడికి పాల్పడినందుకు గాను ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం యాదగిరి సస్పెండ్ కాగా, హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో మద్యం నైట్ ఇంచార్జి విధులు నిర్వహించినందుకు హెడ్ కానిస్టేబుల్ టి రాములు సస్పెండ్ అయ్యారు. అలాగే స్టేషన్ అధికారి ఇచ్చిన ఆదేశాలను అతిక్రమిస్తున్నందుకు చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు చెందిన కానిస్టేబుల్ ఓ సతీష్ ను సస్పెండ్ చేశారు. –అక్షరదర్బార్, వరంగల్

## పాదయాత్ర హామీలకు ప్రాధాన్యత

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ. 1.60 కోట్ల పనులకు శంకుస్థాపన

అక్షరదర్బార్, హనుమకొండ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి జాతర కొనసాగుతోంది. "మాటలు కాదు - చేతల్లోనే అభివృద్ధి" అన్న నినాదంతో ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నియోజకవర్గంలో మరో రూ.1.60 కోట్ల వ్యయంతో చేపట్టే అభివృద్ధి పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. 31వ, 51వ డివిజన్ లలో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులకు ఆయన స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు:

### పాదయాత్ర హామీల అమలు

ఎన్నికల సమయంలో పాదయాత్ర చేస్తూ ప్రజల కష్టాలను స్వయంగా చూశానని, ఇప్పుడు ప్రజా ప్రభుత్వంలో ఆ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నామని తెలిపారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, కాంట్రాక్టర్లు నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి కాలనీని అభివృద్ధి చేయడమే లక్ష్యమని, ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టి డ్రైనేజీ, రోడ్డు కనెక్టివిటీ సమస్యలను తీరుస్తున్నామని స్పష్టం చేశారు.



# 95.15 శాతం ఉత్తీర్ణత

- పది ఫలితాల్లో 'మన' విద్యార్థుల జయకేతనం
- బాలురపై బాలికలదే పైచేయి.. ములుగు జిల్లా టాప్
- మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ సహదేవరావు హర్షం
- వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 5,731 పాఠశాలలు
- ఉత్తీర్ణతలో రెసిడెన్షియల్ పాఠశాలల జోరు

04





## కుక్క కాటు బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

అక్షరదర్బార్, నర్సంపేట: పట్టణంలోని వివిధ డివిజన్లకు చెందిన 16 మంది కుక్క కాటు బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూస్తామని వార్డు కౌన్సిలర్ వేముల సంధ్యా సాంబయ్య గౌడ్ భరోసా ఇచ్చారు. బుధవారం నర్సంపేట జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆమె పరామర్శించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. కిషన్‌తో మాట్లాడి బాధితులకు నాణ్యమైన చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రిలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 10 లక్షల వ్యయంతో ఆర్‌ఓ ప్లాంట్ మంజూరైందని, వారం రోజుల్లోపు రోగులకు అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల సాంబయ్య గౌడ్, రతన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## చిట్యాల చర్చికి డిజిటల్ క్లాక్ బహుకరణ

అక్షరదర్బార్, చిట్యాల: చిట్యాల మండల కేంద్రంలోని సీఎస్ఐ వర్షిప్ సెంటర్ (చర్చి)కు సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య ఆదేశాల మేరకు తౌటం నవీన్ డిజిటల్ అలారం క్లాక్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా చర్చి నిర్వాహకులు నవీన్‌ను శాలువాతో సత్కరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ మిషన్ ఇంచార్జ్ రిజు మాథ్యూ, చర్చి ఫాదర్ సంగి రమేష్, సంఘం పెద్దలు కమలమ్మ, సుమలత మరియు క్రైస్తవ సోదరీసోదరులు పాల్గొన్నారు.

## నడికూడ మండలంలో ఐకేపీ కేంద్రాల ప్రారంభం

అక్షరదర్బార్, పరకాల: పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు నడికూడ మండలంలోని రామకృష్ణాపురం, చౌటుపర్తి, ముస్తలపల్లి, నర్సక్కపల్లె గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. ఐకేపీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను మహిళలకు అప్పగించడం ద్వారా వారికి ఆర్థిక భరోసా కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పోరిక జై సింగ్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు రైతులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పాలనలో రైతులకు కష్టాలు

- చల్లా ధర్మారెడ్డి

అక్షరదర్బార్, పరకాల: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడుతోందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మండిపడ్డారు. బుధవారం పరకాల వ్యవసాయ మార్కెట్‌లోని మక్కల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన, మక్కల కొనుగోళ్లు నిలిపివేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కెట్‌లో కాంటాలు, గన్నీ సంచులు లేక రైతులు రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారని విమర్శించారు. రైతు భరోసా, రైతు బీమా అమలులో ప్రభుత్వం విఫలమైందని, సాగునీరు మరియు కరెంట్ కోతలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే మక్కల కొనుగోళ్లు ప్రారంభించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

## హిందూ సమ్మేళన కమిటీకి ఆర్యవైశ్య సంఘం అభినందనలు

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో నిర్వహించిన హిందూ సమ్మేళనం విజయవంతం కావడం పట్ల పరకాల మండల ఆర్యవైశ్య సంఘం హర్షం వ్యక్తం చేసింది. బుధవారం కన్యకా పరమేశ్వరి ఆలయంలో సంఘం అధ్యక్షుడు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సమ్మేళన కమిటీ సభ్యులను అభినందించారు. హిందూ మత ఔన్నత్యాన్ని చాటిచెప్పే ఇలాంటి బృహత్తర కార్యక్రమాలకు ఆర్యవైశ్య సంఘం ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎర్రం రామన్న, కాచం గురుప్రసాద్, ఆర్యవైశ్య సంఘ నేతలు కృష్ణమూర్తి, రమేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.




## శాస్త్రీయ పద్ధతులతోనే వ్యవసాయంలో అధిక దిగుబడులు

అక్షరదర్బార్, పరకాల: నడికూడ మండలం రాయపర్తి రైతు వేదికలో బుధవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అవగాహన సదస్సు నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. శ్రీకాంత్ మాట్లాడుతూ.. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, విత్తన ఎంపిక మరియు సమగ్ర కీటక యాజమాన్యంపై రైతులకు సూచనలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి మాట్లాడుతూ.. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జైసింగ్, సర్పంచ్ జగత్ ప్రకాష్, ఏఈఓలు మరియు రైతులు పాల్గొన్నారు.






## తాగునీటికీ దిక్కులేని పెద్దాసుపత్రి ఇదేనా అభివృద్ధి?

- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంపై బీజేపీ నేత రాణా ప్రతాప్ రెడ్డి ధ్వజం
- నీటి సౌకర్యం కల్పించకపోతే స్వయంగా ఏర్పాటు చేస్తామని హెచ్చరిక

అక్షరదర్బార్, నర్సంపేట: వందల కోట్ల రూపాయలతో జిల్లా ఆసుపత్రిని అభివృద్ధి చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు, కనీసం తాగడానికి బుక్కెడు నీళ్లు కూడా ఇవ్వలేకపోతున్నాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాణా ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రోగులు తమకు తాగునీటి సౌకర్యం లేక పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తెచ్చారు. రూ. 100 కోట్లు ఖర్చు చేసినా రోగులకు నీరు అందించలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనని ఆయన ఎద్దేవా చేశారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంఓలు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో తామే స్వయంగా నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తామని ఆయన హెచ్చరించారు.

## బాల్య వివాహాలు లేని సమాజమే లక్ష్యం: ప్రేమలత

అక్షరదర్బార్, ములుగు: సురక్షితమైన బాల్యమే సమాజ నిర్మాణానికి పునాది అని, బాల్య వివాహాలు చిన్నారుల ఉన్నతిని నిరోధిస్తాయని జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత పేర్కొన్నారు. బుధవారం జంగాలపల్లి గ్రామంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం మరియు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 'బాలల భద్రత – సైబర్ క్రైమ్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న వయసులో వివాహాలు చేసినా, బాలలను పనుల్లో పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ మరియు సోషల్ మీడియాలో ఎదురయ్యే సమస్యల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్, డిసిపిఓ ఓంకార్, పోలీస్ సిబ్బంది మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఎస్ఎస్‌సీ ఫలితాల్లో శారద విద్యాలయం హ్యాట్రిక్

- వరుసగా మూడో ఏడాది 100 శాతం ఉత్తీర్ణత
- 572 మార్కులతో అగ్రస్థానంలో మార్క విగ్నేశ్వర్

అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని శారద విద్యాలయం హైస్కూల్ పదో తరగతి ఫలితాల్లో మరోసారి అద్భుత విజయాన్ని నమోదు చేసింది. వరుసగా మూడో ఏడాది కూడా వంద శాతం ఫలితాలు సాధించి పాఠశాల హ్యాట్రిక్ కొట్టింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్క సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం.. మార్క విగ్నేశ్వర్ 572 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, దుస్స సిరివెన్నెల (569) ద్వితీయ, పోతుగంటి సంజయ్ (567) తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వీరితో పాటు ఎం.డి. గౌస్య సల్మా, కొంకటి రేష్వంత్ (560), గోరంటాల రామ్ చరణ్ (559) ఉత్తమ మార్కులు సాధించారు. మొత్తం 8 మంది విద్యార్థులు 550కి పైగా, 40 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ప్రతిభ చాటిన విద్యార్థులను, వారి విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.

# గీతాంజలి పాఠశాల విద్యార్థుల సంచలనం

- 575 మార్కులతో సత్తా చాటిన అనుషిక
- 15 మందికి 550 పైగా మార్కులు



అక్షరదర్బార్, నర్సంపేట: పదవ తరగతి పరీక్షల్లో నర్సంపేట గీతాంజలి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు రికార్డు స్థాయి మార్కులతో సత్తా చాటారు. పాఠశాల విద్యార్థిని టి. అనుషిక 575 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, సి.హెచ్. శ్రీక (574), ఈ. రాజవర్ధన్ (573) ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుండి 15 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు, 28 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం విశేషం. విద్యార్థుల విజయం పట్ల విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్. రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# టెన్త్ ఫలితాల్లో వెంకటాపూర్ ప్రభుత్వ బడి సత్తా

అక్షరదర్బార్, వెంకటాపూర్: పదవ తరగతి ఫలితాల్లో వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన జరుపుల అంజలి 560 మార్కులతో మండల టాపర్‌గా నిలవగా, మెట్టు జయశ్రీ (556) ద్వితీయ, రాయవేన శ్రీజ (553) తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, 40 మంది విద్యార్థుల్లో 15 మందికి పైగా 500 పైచిలుకు మార్కులు సాధించడం విశేషం. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఇక్కడే చేర్పించాలని ప్రధానోపాధ్యాయురాలు టి. రాధిక కోరారు. ఈ విజయం సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు

# పది ఫలితాల్లో 'శ్రీ ఆదర్శవాణి' ప్రభంజనం

- 600 మార్కులకు గాను 569 సాధించిన నిహారిక
- 32 మందికి 500 పైగా మార్కులు..
- వంద శాతం ఉత్తీర్ణత



అక్షరదర్బార్, దుగ్గొండి: పదవ తరగతి ఫలితాల్లో దుగ్గొండి మండలంలోని శ్రీ ఆదర్శవాణి పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో కే. నిహారిక 569 మార్కులతో టాపర్‌గా నిలవగా, డి. కావ్యశ్రీ (565), బి. అక్షిత (563), వి. నవ్యశ్రీ (557), ఏ. శ్రీవిద్య (555), సాయి సహస్ర (554), సి.హెచ్. సాయి శ్వేత (554) ఉత్తమ మార్కులు సాధించారు. పాఠశాల చైర్మన్ నాగనబోయిన రవి మాట్లాడుతూ.. 32 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని, వంద శాతం ఉత్తీర్ణత నమోదు కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కవిత, భిక్షపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# మహబూబాబాద్ గీతాంజలి పాఠశాల ఘన విజయం

అక్షరదర్బార్, మహబూబాబాద్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మహబూబాబాద్ పట్టణంలోని గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణతతో ప్రభంజనం సృష్టించారు. పాఠశాల విద్యార్థిని అలేఖ్య 578 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరచగా, జి. అస్మిత (566), గౌరీ ప్రియ (565), చిన్ని (562), మణి చౌహాన్ (560), జ్వలిత (559), మంజునాథ్ (559) ఉత్తమ మార్కులు సాధించారు. మొత్తం విద్యార్థుల్లో 19 మంది 500కు పైగా మార్కులు సాధించి డిస్టింక్షన్‌లో నిలిచారు. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల బోధన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని గీతాంజలి గ్రూప్ డైరెక్టర్ రామకృష్ణ పేర్కొంటూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

# శాయంపేట పది ఫలితాల్లో ప్రభుత్వ బడుల సత్తా

- వర్ష హాసినికి 581 మార్కులు
- బాలికల పాఠశాలలో 100% ఉత్తీర్ణత

అక్షరదర్బార్, శాయంపేట: పదవ తరగతి ఫలితాల్లో శాయంపేట మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచాయి. టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ (TSWRS) విద్యార్థిని వర్ష హాసిని 581 మార్కులతో రికార్డు సృష్టించగా, కేజీబీవీకి చెందిన హరిత 568 మార్కులు సాధించారు. జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల విద్యార్థులు బాసని అన్విత (560), శివరాత్రి దీవెన (532), ఎండి రేష్మ (526) టాపర్లుగా నిలిచారు. సదరు బాలికల పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించడం విశేషం. ప్రైవేటు విభాగంలో నవోదయ హైస్కూల్ విద్యార్థిని నేత్ర 562 మార్కులు సాధించారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల క్రమశిక్షణే ఈ విజయానికి కారణమని ప్రధానోపాధ్యాయులు పేర్కొన్నారు.

# పది ఫలితాల్లో 'షైన్' విద్యార్థుల సంచలనం

- 588 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మెరిసిన అక్షర
- 362 మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు




అక్షర దర్బార్, హనుమకొండ: బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో షైన్ విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. పాఠశాల విద్యార్థిని ఏ. అక్షర 588 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, ఎల్. రేవంత్, ఎన్. అఫ్రోజ్ (586), సమీరా నయీమ్ (585) రికార్డు స్థాయి మార్కులు సాధించారు. అలాగే వెలుదండి సీమ, జి. సంహిత, కే. సుమిత్ 584 మార్కులు, టి. హాసిని, ఏ. ప్రశాంతి, ఏ. సుశాంత్, సీహెచ్. సిరి 583 మార్కులతో తమ సత్తా చాటారు. మొత్తం 362 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించగా, 302 మంది 85 శాతానికి పైగా మార్కులు పొందడం గమనార్హం. ఐఐటీ ఫౌండేషన్, నీట్ కోచింగ్‌తో పాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని విద్యాసంస్థల అధినేత మూగల కుమార్ యాదవ్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ రమ, సెక్రటరీ శ్రీనివాస్ యాదవ్, ఐఐటీ కోఆర్డినేటర్ రమేష్ యాదవ్ మరియు ఉపాధ్యాయ బృందం అభినందించారు.



అక్షర దర్బార్ Voice of the People

# విద్యార్థుల సమస్యలపై పోరాడితే అరెస్టులా?

- బీఆర్ఎస్వీ మండిపాటు

అక్షరదర్బార్, శాయంపేట: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తుంటే ప్రభుత్వం నిర్బంధాలు విధిస్తోందని బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ విమర్శించారు. బిఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చిన 'ఫీజు పోరుబాట'లో భాగంగా కొమ్ముల శివను పోలీసులు అరెస్టు చేసి శాయంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 8 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, శాంతియుతంగా పోరాడుతున్న నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సరికాదని ఆయన అన్నారు.



# పది ఫలితాల్లో 'శివాని' విద్యార్థుల ప్రభంజనం

- 575 మార్కులతో సత్తా చాటిన ఎం. నక్షత్ర
- 12 మందికి 500 పైగా మార్కులు

అక్షర దర్బార్, నర్సంపేట: పదవ తరగతి ఫలితాల్లో నర్సంపేటలోని శివాని పబ్లిక్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఎం. నక్షత్ర 575 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలవగా, సాహితి (568), ఎం. సాదృశ్య (568) ద్వితీయ స్థానాల్లో నిలిచారు. పాఠశాలకు చెందిన 12 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి తమ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కీర్తిని పెంచారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వేములపల్లి సుబ్బారావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డైరెక్టర్ గిరిగాని రాహుల్ వర్మ మాట్లాడుతూ.. ఇదే పట్టుదలను పైచదువుల్లోనూ కొనసాగించాలని సూచించారు. లక్ష్యం చేరేవరకు నిరంతరం శ్రమించే వారికే విజయం దక్కుతుందని ప్రిన్సిపాల్ మొలుగూరి సురేందర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# 21 నుంచి సరస్వతి అంత్య పుష్కరాలు

- పోస్టర్, టీజర్ విడుదల చేసిన మంత్రులు సురేఖ, శ్రీధర్ బాబు
- పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశాలు

అక్షరదర్బార్, కాళేశ్వరం : సరస్వతి అంత్య పుష్కరాల నిర్వహణకు సంబంధించి బుధవారం డా బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన బుధవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి అంత్య పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు. పుష్కరాల నిర్వహణలో భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలు, రవాణా, పారిశుధ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, సరస్వతి అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు జరుగనున్న పుష్కరాలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున చేపట్టిన ఏర్పాట్లను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సరస్వతి అంత్య పుష్కరాల పోస్టర్, పుష్కరాల టీజర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ధార్మిక సలహాదారు గోవింద హరి తదితరులు పాల్గొన్నారు.



# 95.15 శాతం ఉత్తీర్ణత

- పది ఫలితాల్లో 'మన' విద్యార్థుల జయకేతనం
- బాలురపై బాలికలదే పైచేయి.. ములుగు జిల్లా టాప్
- మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ సహదేవరావు హర్షం
- వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 5,731 పాఠశాలలు
- ఉత్తీర్ణతలో రెసిడెన్షియల్ పాఠశాలల జోరు



అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర పదవ తరగతి (ఎస్సెస్సీ) ఫలితాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్రవ్యాప్తంగా 95.15 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత ఏడాదితో (92.78 శాతం) పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడం విశేషం. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుధవారం మధ్యాహ్నం ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. ఈ ఏడాది పరీక్షలకు హాజరైన మొత్తం అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి. మొత్తం హాజరైన విద్యార్థులు 5,26,166 మంది కాగా ఉత్తీర్ణత సాధించిన వారు 4,97,312 మంది. మొత్తం ఉత్తీర్ణత శాతం 95.15.

**- ఆడబిడ్డలదే హవా**

ప్రతి ఏటా లాగే ఈసారి కూడా బాలికలే పైచేయి సాధించారు. బాలికల ఉత్తీర్ణత 96.26 శాతం. బాలుర ఉత్తీర్ణత 94.07 శాతం. బాలుర కంటే బాలికలు సుమారు 2.19 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించి తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు.

**ములుగు జిల్లా నెం 1**

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ములుగు జిల్లా 99.30 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, అత్యల్పంగా హైదరాబాద్ జిల్లా 89.23 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలు కూడా ఉత్తమ ఫలితాలతో టాప్-3లో చోటు దక్కించుకున్నాయి. పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలవడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్ సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్ సహదేవరావు హర్షం వెలిబుచ్చారు. విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5,731 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించాయి. సంక్షేమ గురుకుల పాఠశాలలు 99 శాతానికి పైగా ఉత్తీర్ణతతో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఫలితాలు సాధించాయి. సోషల్ స్టడీస్‌లో అత్యధికంగా 99.61 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం జూన్ 5 నుండి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు.

# ఖాకీలకు సీపీ షాక్ ట్రీట్‌మెంట్

- అవినీతి పోలీసులపై సన్ ప్రీత్ సింగ్ ఉక్కుపాదం
- వరంగల్ కమిషనరేట్ పరిధిలో వరుస సస్పెన్షన్లు
- తాజాగా ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఒక కానిస్టేబుల్ సస్పెన్షన్
- తప్పు చేస్తే ఇంటికే.. అక్రమార్కుల్లో వణుకు



అక్షరదర్బార్, వరంగల్ : విధి నిర్వహణలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన పోలీసులపై వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కొరడా ఝులిపిస్తున్నారు. ఫిర్యాదులు తన దృష్టికి రాగానే విచారణకు ఆదేశిస్తున్నారు. నివేదికలు అందగానే అవినీతిపరులు, అక్రమార్కులపై సస్పెన్షన్ వేటు వేస్తున్నారు. ఇటీవలి కాలంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లను ఆయన సస్పెండ్ చేయడం పోలీసు శాఖలో కలకలం రేపుతుంది. ప్రధానంగా అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. తాజాగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధవారం ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లతో పాటు ఒక కానిస్టేబుల్ పై సస్పెన్షన్ వేటు పడింది. ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, ఒక కానిస్టేబుల్ ను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా వడ్డీ వ్యాపారం నిర్వహిస్తూ, డబ్బు ఇవ్వని వారి ఇంటి పై దాడికి పాల్పడినందుకు గాను ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ ఎం యాదగిరి సస్పెండ్ కాగా, హసన్ పర్తి పోలీస్ స్టేషన్ లో మద్యం నైట్ ఇంచార్జి విధులు నిర్వహించినందుకు హెడ్ కానిస్టేబుల్ టి రాములు సస్పెండ్ అయ్యారు. అలాగే స్టేషన్ అధికారి ఇచ్చిన ఆదేశాలను అతిక్రమిస్తున్నందుకు చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు చెందిన కానిస్టేబుల్ ఓ సతీష్ ను సస్పెండ్ చేశారు.

**కొద్ది రోజుల క్రితం**

వరంగల్ నగరంలోని మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ సుమన్‌పై వారం రోజుల క్రితం సస్పెన్షన్ వేటు పడింది. మొబైల్ ఫోన్ చోరీ కేసులో ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితుల వద్ద డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై అధికారులు విచారణ జరిపారు. ఆరోపణలు నిజమని తేలడంతో పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శాఖాపరమైన చర్య తీసుకున్నారు.

**నర్సంపేట, బచ్చన్నపేటలో..**

అంతకు ముందు నర్సంపేట టౌన్ ఎస్ఐ రవి కుమార్ పై సస్పెన్షన్ వేటు పడింది. అవినీతికి పాల్పడ్డాడని వచ్చిన ఆరోపణలు నిజం కావడంతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ సన్ ప్రీత్ సింగ్ ఏప్రిల్ 23న ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 11న బచ్చన్నపేట సబ్ ఇన్ స్పెక్టర్ హమీద్ వరంగల్ పోలీస్ కమిషనర్ కు అటాచ్ అయినట్టు సమాచారం. త్వరలోనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో సర్కిల్ ఇన్ స్పెక్టర్లు, సబ్ ఇన్ స్పెక్టర్ల బదిలీలు జరగనున్న నేపథ్యంలో పోలీసులపై చర్యలు తీసుకోవడం చర్చగా మారింది.

**ఆత్మకూరు ఎస్సై సస్పెన్షన్**

ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సతీష్ ను సస్పెండ్ చేస్తూ పోలీస్ కమిషనర్ ఈనెల 10న ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలతో పాటు పలు కేసుల్లో అలసత్వం వహించినట్లుగా అధికారుల విచారణలో నిర్ధారణ కావడంతో ఎస్ఐని సీపీ సస్పెండ్ చేశారు.

**మిల్స్ కాలనీ ఎస్సైపై..**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మిల్స్ కాలనీ ఎస్ఐ సురేష్‌పై సస్పెన్షన్ వేటు పడింది. విధుల్లో నిర్లక్ష్యం సహా ఇతర ఆరోపణల నేపథ్యంలో జరిగిన విచారణలో ఆరోపణలు నిజమని తేలడంతో అధికారులు నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా సీపీ సురేష్‌ను మార్చి 26న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజలకు రక్షణగా ఉండాల్సిన వారే అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు అనే సంకేతాన్ని సీపీ గట్టిగా పంపిస్తున్నారు.